అనాథ పిల్లలకు వరం
ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్


విలేజ్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ విగ్రహం


బొమ్మలు తయారు చేస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ఒక అమ్మ ఒడి, సురక్షితమైన ఆశ్రయం కల్పించి, వారి జీవితాలకు బంగారు భవిష్యత్తును అందిస్తున్న ఓ గొప్ప మానవీయ సంస్థ భీమిలిలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్. ఈ విలేజ్ కేవలం ఒక ఆశ్రయం కాదు, పిల్లలకు ప్రేమ, కుటుంబం, మంచి విద్యను అందించి వారిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టే ఒక పునరుజ్జీవన కేంద్రం.

ఒక మహనీయుడి దార్శనికతకు ప్రతీక.

ఈ చిల్డ్రన్స్ విలేజ్‌ల ఏర్పాటు వెనుక ఆస్ట్రియాకు చెందిన హెర్మన్ మైనర్ అనే మహనీయుడి దార్శనికత ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది పిల్లలు అనాథలవ్వడం చూసి చలించిపోయిన మైనర్, వారిని ఆదుకోవాలనే పవిత్ర సంకల్పంతో 1949లో ఆస్ట్రియాలో మొట్టమొదటి చిల్డ్రన్స్ విలేజ్‌ను స్థాపించారు. ఆయన కృషి ఫలితంగా నేడు ప్రపంచవ్యాప్తంగా 132 దేశాల్లో 500కు పైగా ఎస్‌వోఎస్ విలేజ్‌లు వెలిశాయి.

1962లో ప్రారంభం

భారతదేశంలో తొలి ఎస్ఓఎస్ విలేజ్ 1962లో ప్రారంభమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 32 విలేజ్‌లు ఉండగా, మన రాష్ట్రంలో విశాఖ జిల్లాలోని భీమిలి సమీపంలో 1997లో విశాలమైన ప్రాంతంలో 14 ఇళ్లతో ఈ చిల్డ్రన్స్ విలేజ్ రూపుదిద్దుకుంది. ఆ తర్వాత తిరుపతి, హైదరాబాద్‌లలో మరో రెండు విలేజ్‌లు ఏర్పాటయ్యాయి.

13ఏళ్లు దాటిన బాలురకు..

గతంలో 13 ఏళ్లు దాటిన మగపిల్లలను విశాఖ, మధురవాడలోని యూత్ హాస్టల్స్‌లో ఉంచి చదివించేవారు. అయితే ప్రస్తుతం వారందరినీ ఇదే ఆవరణలోని వేరే చోట ఉంచి సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ భీమిలి విలేజ్‌లో 86 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 46 మంది బాలికలు, 40 మంది బాలురు ఉన్నారు. వీరిని చూసుకోవడానికి నలుగురు యువ ఫాదర్లు (యూత్ ఫాదర్స్) కూడా ఉన్నారు.

ప్రేమతో ఆదరణ

ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కేవలం ఆశ్రయం కల్పించడమే కాకుండా, అనాథ పిల్లలకు బాధ్యతాయుతమైన తల్లి ప్రేమతో కూడిన వాతావరణాన్ని అందించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, బంగారు భవిష్యత్తును అందిస్తోంది.


ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్

అమ్మ ప్రేమ, సురక్షిత భవిష్యత్తు

ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో ప్రతి ఇంటికీ ఒక 'మదర్' ఉంటారు. ఈ తల్లులు 5 నుంచి 10 మంది పిల్లలను ఎటువంటి లోటు లేకుండా తల్లి ప్రేమతో పెంచి పెద్ద చేస్తారు. వారికి మంచి చదువు చెప్పించడంతో పాటు, ఉద్యోగాలు సంపాదించుకునేలా ప్రోత్సహిస్తారు. ఆడపిల్లలకు వివాహాలు చేసి, వారి జీవితాలకు భరోసా కల్పిస్తారు. సంస్థ నిర్వహణకు ఒక డైరెక్టర్, ఇతర సిబ్బంది నిరంతరం శ్రమిస్తారు.


విలేజ్‌లో జరిగిన హోలీ వేడుకలో పాల్గొన్న క్రికెటర్ విరాట్ కోహ్లి


గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

నేడు ఎస్‌వోఎస్ డే వేడుకలు

సోమవారం ఎస్‌వోఎస్ వ్యవస్థాపకుడు హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా భీమిలి విలేజ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు విశాఖ ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ రాధ ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. ఈ సందర్భంగా చదువు, క్రీడల్లో రాణించిన పిల్లలకు బహుమతులు అందివ్వడంతో పాటు, ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. ఇది పిల్లల ప్రతిభను గుర్తించి, వారిలో స్ఫూర్తిని నింపే ఒక గొప్ప అవకాశం.


పిల్లలకు భోజనం పెడుతున్న మదర్

నాలుగో ఫ్లోర్ నుంచి జారి పడి మహిళ మృతి


మృతురాలు ఆదిలక్ష్మి(ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలోని రఘు విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి తెర్లాపు ఆదిలక్ష్మి (38) అనే మహిళ శనివారం అర్ధరాత్రి దుర్మరణం చెందింది. ఈ ఘటనకు సంబంధించి భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా పాచిపెంట మండలం గొలుగువలసకు చెందిన ఆదిలక్ష్మికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న వయసులోనే భర్త రాము అనారోగ్యంతో మరణించాడు. ఆరేళ్ల క్రితం ఆమె తెలంగాణలోని భద్రాచలానికి చెందిన సాంబారిక శివను రెండో వివాహం చేసుకుని పిల్లల బాధ్యతలను చూసుకుంటోంది. పిల్లలిద్దరూ పాచిపెంటలో బంధువుల ఇంట నివాసముంటున్నారు. నాలుగేళ్లుగా ఆదిలక్ష్మి, శివ దంపతులు దాకమర్రిలోని రఘు విద్యాసంస్థల భవన నిర్మాణ పనులకు వచ్చి అక్కడే నివసిస్తున్నారు. శనివారం రాత్రి వీరు ఉంటున్న గదికి తాళం వేసి ఉండటంతో, నిర్మాణంలో ఉన్న నాలుగో అంతస్తుపై నిద్రపోవడానికి వెళ్లారు. అక్కడ గాలి సరిగా రాకపోవడంతో, మరింత ఎత్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కారు. అర్ధరాత్రి వేళ చలి ఎక్కువగా ఉండటంతో, ఆదిలక్ష్మి, శివ కిందకు దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి గోడపై కాలు వేసి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారింది. నాలుగో అంతస్తు నుంచి కిందపడిపోవడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడి సెక్యూరిటీ సాయంతో శివ ఆమెను సంగివలసలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించాడు. అయితే అప్పటికే ఆదిలక్ష్మి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆదిలక్ష్మి ఆకస్మిక మరణంతో పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజలను పురస్కరించుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలను ఆలపించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా మందిరంలోని రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయస్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ఆధ్యాత్మిక వాతావరణం భక్తులకు గొప్ప అనుభూతిని పంచింది.

అలరించిన గీతాలాపన


శ్రీవారి గీతాలాపన చేస్తున్న భజన బృందం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తి వాతావరణం నెలకొంది. రాజాంకు చెందిన శ్రీ వెంకట రామ కళా భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవారి గీతాలాపన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నిర్వాహకులు కె. అప్పలనాయుడు పర్యవేక్షణలో భజన బృందం 'అదివో అల్లదివో', 'వేడుకుందామా శ్రీ వెంకటగిరి వెంకటేశ' వంటి సుప్రసిద్ధ శ్రీవారి పాటలను మధురంగా ఆలపించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాటలను వింటూ స్వామివారిని స్మరించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఆలయంలో పండుగ వాతావరణాన్ని తలపించింది.

ముగిసిన ఉచిత ధ్యాన శిబిరం


ధ్యాన శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు

తగరపువలస: స్థానిక గీతామందిరంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఉచిత ధ్యాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 150 మంది ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించారు. ఇలాంటి ధ్యాన శిబిరాలను తరచుగా నిర్వహించాలని స్థానికులు నిర్వాహకులను కోరారు. ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎస్.హేమిషా కైవసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది మహిళా చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో (1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎస్.హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో టి.బంధవిక, డి.దివ్య (1463), హెచ్ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తో పాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఆసక్తికరంగా ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. మరోవైపు ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.

ఆటవస్తువులు శిథిలం


మిగిలిన ఊయల స్టాండ్


పార్కులో నిలిచిపోతున్న వర్షం నీరు

తగరపువలస: ఆనందపురం మండలం బోని పంచాయతీలో పార్కు, రక్షిత మంచినీటి పథకం మెట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై పంచాయతీ వాసులు పదేపదే పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా, ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన మెట్లు పూర్తిగా శిథిలమైపోయాయి. దీంతో ట్యాంకును శుభ్రం చేయడానికి వెళ్లే సిబ్బంది తాడు సాయంతో ప్రాణాలకు తెగించి పైకి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఎంతో ప్రమాదకరమని, తక్షణమే మెట్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని పార్కు కూడా సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారింది. వర్షం పడినప్పుడల్లా పార్కులో నీరు నిలిచిపోతుండటంతో చిన్నారులు ఆడుకోవడానికి వీలు లేకుండా పోతోంది. పార్కును గ్రావెల్‌తో ఎత్తు చేయించి, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఊయల కేవలం స్టాండ్ మాత్రమే మిగిలి ఉందని, అది పూర్తిగా పాడైపోయిందని పంచాయతీ వాసులు చెబుతున్నారు. పిల్లలు ఆడుకోవడానికి వీలుగా ఊయలను మరమ్మతు చేయించాలని లేదా కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫిట్‘లెస్’ ట్యాంకర్లు

మృత్యు శకటాలు
- అరిగిపోయిన టైర్లు
- నంబర్ ప్లేట్ లేని వైనం
- ట్యాంకర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి
- నిబంధనలు పాటించని వాహనాలు
- అధికారపార్టీకి చెందిన వ్యక్తి వాహనాలు కావడంతో చర్యలు శూన్యం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాటర్ ట్యాంకర్ ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ రాము దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంకర్‌ను పరిశీలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవడం ఖాయం. వాటర్ ట్యాంకర్‌కు అరిగిపోయిన టైర్లు, పనిచేయని సిగ్నల్స్, అద్దాలు లేకపోవడం, నంబర్ ప్లేట్ లేకపోవడం, రోడ్డు టాక్స్ చెల్లించకపోవడం వంటి అంశాలు చూస్తుంటే రవాణా శాఖ సిబ్బంది అసలు దీనికి ఫిట్‌నెస్ ఎలా ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యజమానికి ఇలాంటి అధ్వాన స్థితిలో మరో మూడు ట్యాంకర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

యథేచ్ఛగా తిరుగుతున్న ప్రమాదకర వాహనాలు

ఈ వాహనాలు 24 గంటలూ ఎన్ఆర్ఐ ఆస్పత్రితో పాటు తిరుమల విద్యాసంస్థలకు తాగునీరు సరఫరా చేస్తుంటాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వాహనాలు నిత్యం తగరపువలస వీధులు, మెయిన్‌రోడ్డు, సర్వీస్‌రోడ్లపై తిరుగుతున్నా రవాణా శాఖ, పోలీస్ సిబ్బంది అభ్యంతరాలు చెప్పకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు

ఈ వాహనాలు తిరిగే ప్రాంతంలోనే ట్రాఫిక్ పోలీసులు నిత్యం వాహనాలను ఆపి చలాన్లు తనిఖీ చేయడంతో పాటు వాహనాలకు సంబంధించిన సర్టిఫికెట్లు చూస్తుంటారు. అలాంటిది కాలం చెల్లిన, మృత్యు శకటంలాంటి ఈ వాహనాలు కళ్ల ముందు తిరుగుతున్నా వారికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు.


శనివారం రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామును చిదిమేసిన ట్యాంకర్

పలు అనుమానాలు

ప్రమాదం జరిగిన తర్వాత ట్యాంకర్‌ను భీమిలి పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా ప్రమాద స్థలంలోనే వదిలివేయడం పట్ల కూడా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్లు అధికార పార్టీ నాయకునికి చెందినవి కావడంతోనే రవాణా శాఖ, పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని, అందుకే ఒక పేద కుటుంబానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రుషికొండ బీచ్‌లో అనధికారికంగా కంటైనర్ ఏర్పాటు


రుషికొండ బీచ్ వద్ద ఏర్పాటు చేసిన కంటైనర్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో అనధికారికంగా ఒక కంటైనర్‌ను ఏర్పాటు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన ఈ బీచ్ నిర్వహణపై ఇప్పటికే పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అనుమతులు లేకుండా కంటైనర్ ఏర్పాటు చేయడం మరో సమస్యగా పరిణమించింది. ఈ ప్రాంతంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలన్నా, లేదా ఏదైనా ఏర్పాటు చేయాలన్నా పర్యాటక శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలి. అలాంటిది, ఎటువంటి అనుమతులు లేకుండా ఈ కంటైనర్‌ను ఎలా ఏర్పాటు చేశారన్నది పలువురి ప్రశ్న. బీచ్‌లలో అనధికారిక నిర్మాణాలు పర్యావరణానికి, పర్యాటకుల భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా పర్యాటక శాఖ అధికారిణి మాధవిని వివరణ కోరగా రుషికొండ బీచ్‌లో కంటైనర్ ఏర్పాటు విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దానిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అనుమతులు లేకుండానే కంటైనర్ ఎలా ఏర్పాటు చేయగలిగారు, దీని వెనుక ఎవరి ప్రమేయం ఉందనే అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రుషికొండ బీచ్‌కున్న అంతర్జాతీయ గుర్తింపును కాపాడటానికి పర్యాటక శాఖ మరింత పారదర్శకంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

'యోగాకు రూ.కోట్లు.. రోడ్లపై పాట్లు'


రుషికొండలో శిథిలమైన రహదారి

తగరపువలస: విశాఖలో రహదారుల అధ్వాన స్థితిపై జీవీఎంసీ మధురవాడ జోన్ 8వ వార్డుకు చెందిన బొట్ట కృష్ణన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నిత్యం అవసరమైన రహదారులకు మరమ్మతులు చేయించలేని కూటమి ప్రభుత్వం, 'ఆసనాల' పేరుతో వందల కోట్లు దోపిడీకి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఆసన కార్యక్రమాలు వృథా ప్రయాస, ఖర్చుతో కూడుకున్నవే తప్ప, వాటి వల్ల ఒరిగిందేమీ లేదని కృష్ణన్ స్పష్టం చేశారు. యోగాసనాలకు కోట్లాది రూపాయలు వెచ్చించి..అభివృద్ధిని పక్కన పెట్టడం సరికాదని పేర్కొన్నారు. రహదారుల నిర్మాణం, విద్య, వైద్య రంగాలపై దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మూలకు చేరిన మరుగు దొడ్లు


పాత మధురవాడ మెట్ట వద్ద మూలకు చేరిన మరుగుదొడ్లు

మధురవాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీఎంసీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్న స్వచ్ఛ భారత్, బహిరంగ మల, మూత్ర విసర్జన నివారణ కార్యక్రమాలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన నిదర్శనం 7వ వార్డులోని మరుగుదొడ్ల నిర్వహణ లోపం. జీవీఎంసీ 7వ వార్డు, వాంబే కాలనీకి వెళ్లే రోడ్డులో, పాత మధురవాడ వద్ద లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారాయి. కొంతకాలం క్రితం వాటర్ ట్యాంక్ శిథిలమవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మరుగుదొడ్లు చాలా వరకు వాడుకలో లేకుండా పోయాయి. ప్రస్తుతం అవి పూర్తిగా తుప్పలు, ముళ్ల దొండకలతో నిండిపోయి మరింత అధ్వానంగా తయారయ్యాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా, ఉన్నత స్థాయి అధికారులు కనీసం స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే చర్యలు చేపట్టి, ఈ మరుగుదొడ్లను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

బీచ్‌లో పర్యాటకుల తాకిడి


రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

కొమ్మాది: ప్రముఖ పర్యాటక బీచ్‌లన్నీ ఆదివారం పర్యాటకుల తాకిడితో సందడిగా మారాయి. వేసవి సెలవులు, వారాంతం కావడంతో ఉదయం నుంచే పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భీమిలి బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, కోకోనట్ ఎరీనా బీచ్, రామాద్రి బీచ్, తొట్లకొండ, బావికొండ, రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాలన్నీ పర్యాటకుల కోలాహలంతో నిండిపోయాయి. కుటుంబాలతో, స్నేహితులతో వచ్చిన పర్యాటకులు సాయంత్రం వరకు బీచ్‌లలో సరదాగా గడిపారు. ముఖ్యంగా చిన్నారులు సముద్రపు ఒడ్డున ఆడుకుంటూ, అలలతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా కనిపించారు. పిల్లల ఆనందం పెద్దలకు సైతం ఉల్లాసాన్ని పంచింది. తీరం పొడవునా పర్యాటకులు సేదతీరుతూ, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు.

స్టాపర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది : బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టూడియో సమీపంలో స్టాపర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెం అరుంధతినగర్‌కు చెందిన జి.ఈశ్వరరావు (34) ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జి.అనిత నగరంలోని బంగారు నగల విక్రయ దుకాణంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం ఉద్యోగరీత్యా ఈశ్వరరావు భీమిలి వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి వస్తుండగా యోగాంధ్ర కోసం రామానాయుడు స్టూడియో సమీపంలో ఏర్పాటు చేసిన స్టాపర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై దూరంగా ఎగిరిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

బాబయ్యమ్మకు ఘన నివాళి


బాబయ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: మధురవాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగోతి తాతారావు, అప్పారావుల మాతృమూర్తి, వైఎస్సార్‌సీపీ అభిమాని దివంగత నాగోతి బాబయ్యమ్మకు పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం చంద్రంపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మధురవాడకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. నగరంలోని జ్యోష్ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ అద్భుత నృత్య విన్యాసాలతో మెప్పించారు. 'బుజ్జి బుజ్జి గణపయ్య' గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాతపస్వి కే. విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'సప్తపది' చిత్రంలోని 'ఐగిరినందిని...' గీతానికి ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరకతమణి నృత్యాంశంలో ప్లేట్లపై నిల్చొని అద్భుతంగా నర్తించిన బృంద నృత్యం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. జతిస్వరం, ముకుందా.. ముకుందా.., ప్రణవాలయం.., జతిస్వరం.., అన్నమయ్య కీర్తనలకు కళాకారులు అద్భుతంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించి అలరించారు. చివరగా అరకు దింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారులు ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజీ, సంజన, మనవిత, ననవ్య, తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దీనికి మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.